సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

శనివారం । 6 । జనవరి । 2024



మేడారంలో విస్తృత సేవలు 8లో

మేడారం జాతర సమయంలో బీఎస్ఎన్ఎల్ సేవల్ని మరింత విస్తృతం చేస్తామని బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి అన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

వెనుకబడిన గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30°/18°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జాతరలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి



ఎంజీఎం: ఐఎంఏ ఆధ్వర్యంలో ఐనవోలు జాతరలో భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా ఐఎంఏ ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం ఐఎంఏ నూతన కార్యవర్గ సభ్యులు అడిషనల్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మహ్మద్ అన్వర్, బింగి శ్రీనివాస్ ఈనెల 12 నుంచి 16 వరకు నిర్వహించే జాతరకు వచ్చే భక్తుల కోసం స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎంఏ కోశాధికారి శ్రవణ్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డాక్టర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా జగన్‌మోహన్



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల స్టడీ సెంటర్ నూతన డైరెక్టర్‌గా డాక్టర్ కొంగర జగన్‌మోహన్ నియమితులయ్యారు. హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఆదేశాల మేరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అభివృద్ధి అధికారి నిర్మల చేతుల మీదుగా శుక్రవారం జగన్‌మోహన్ నియామక పత్రం అందుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్‌కు పాల్పడుతూ.. ఐదుగురు విద్యార్థులు పట్టుబడ్డారు. వారిని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి తెలిపారు.

గ్రూప్స్ ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ

కాజీపేట అర్బన్: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్‌-1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంవీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని 0870-2571192 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎంజీఎంలో గార్డెనింగ్‌పై పరిశీలన

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో మొక్కల పెంపకం, గార్డెనింగ్‌పై దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఐఎఫ్ఎస్ అధికారి, మంత్రి ఓఎస్డీ టి.కృష్ణ శుక్రవారం ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని అంతర్గత రహదారులు, పార్కింగ్ ప్రదేశాలు, బీటీ రోడ్లు, నడకదారులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఖాళీ ప్రదేశాల్లో ఏ విధంగా గార్డెనింగ్ మెరుగుపర్చాలనేదానిపై ఎంజీఎం పరిపాలనాధికారులు ఐఎఫ్ఎస్ అధికారి కృష్ణతో చర్చించి పూర్తి స్థాయి నివేదికలు అందించారు.

వరంగల్‌లో బినామీ రేషన్ షాపులు?

వరంగల్ : వరంగల్ మండలంలో సుమారు 14 నుంచి 20 మంది వరకు బినామీలు రేషన్ షాపులు నిర్వహిస్తున్నారని తెలిసింది. ఈమేరకు బినామీలు రేషన్ షాపులు నిర్వహిస్తున్నారంటూ శుక్రవారం పలువురు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టింగ్‌లు పెట్టారు. ఈవిషయంపై తహసీల్దార్ ఇక్బాల్‌ను వివరణ కోరగా వాట్సాప్‌లో పెట్టిన మెసేజ్‌లు తన దృష్టికి వచ్చాయని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక బృందంతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



సాక్షి వరంగల్: తూర్పు నియోజకవర్గ పరిధి దేశాయిపేటలో 200 డబుల్ బెడ్ రూం ఇళ్లను పూర్తి చేశారు. బలహీనవర్గాలకు నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం జీఓలో పేర్కొన్నప్పటికీ జర్నలిస్టుల కాలనీ అంటూ.. ప్రచారం చేయడంతో నిర్మాణ పనులు కాస్త వేగంగా జరిగాయి. అప్పటి అధికార పార్టీ నేతల అలసత్వంతో పంపిణీ కాలేదు. ఇళ్లు ఖాళీగా ఉండడంతో రాత్రయ్యిందంటే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మందు బాబులు సొంత ఇంట్లో చేసుకున్న విధంగా వీటిని వాడుతున్నారని అక్కడి ప్రజలు చెబుతున్నారు.

సాక్షి పరిశీలన



ఈ ఫొటోలు చూడండి.. హనుమకొండలోని ప్రెస్‌క్లబ్ పక్కన జితేందర్‌నగర్ (బాలసముద్రం ఏరియా)లో నిర్మాణం పూర్తయి పంపిణీ చేయకుండా నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు. వీటి నిర్మాణం పూర్తయి మూడేళ్లు దాటినా.. అర్హులైన పేదలను గుర్తించలేదు. పంపిణీ చేయలేదు. దీంతో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్ల తాళాలు, తలుపులు పగులగొట్టి విలువైన ఎలక్ట్రికల్ తదితర సామగ్రిని ఎత్తుకెళ్లారు. కొన్ని గదుల తలుపులు విరిగిపోయాయి. పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుతున్నాయి.

అదిగదిగో మీ ఇల్లు..

ఐదారేళ్లు ఊరించి ఉసూరుమనిపించారు..

- గ్రేటర్, హనుమకొండ పరిధిలో 4,784 ఇళ్లకు.. పూర్తయ్యింది 1,196 మాత్రమే
- అర్హులకు అందని రెండు పడక గదుల ఇళ్లు
- నిర్మాణం పూర్తయినా పంపిణీకి నోచుకోని వైనం..
- హనుమకొండలో శిథిలావస్థకు.. ఇప్పటికే కిటికీలు, తలుపులు ధ్వంసం
- అర్హులైన పేదలకు అందని 'డబుల్' ఇళ్లు

సాక్షిప్రతినిధి, వరంగల్:

పిల్లలు మారాం చేస్తే అదిగదిగో చందమామ అని చూపిస్తూ బుజ్జగిస్తుంటాం. అలాగే ఉంది డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి.. సగం సగం కట్టి.. కట్టిన వాటిని చూసి మురవడమే తప్ప చేతికి అందింది లేదు. గృహ ప్రవేశం చేసింది లేదు. పేదల సొంతింటి కలను సాకారం చేసింది లేదు. పేద కుటుంబాల సొంతింటి చిరకాల కోరికను తీర్చాలన్న ఉద్దేశంతో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పథకం ఐదారేళ్లు ఊరించి ఉసూరుమనిపించింది. ఆర్భాటంగా మొదలెట్టిన ఈపథకం అర్హులైన లబ్ధిదారులను తీవ్ర నిరాశకు గురి చేసింది. గ్రేటర్ పరిధి, హనుమకొండ జిల్లాలో 5,221 ఇళ్లను 2017లో అప్పటి ప్రభుత్వం మంజూరు చేస్తే.. 4,784 ఇళ్లకే పరిపాలనా అనుమతి లభించింది. ఇందులో కేవలం 1,196 సుమారు ఐదున్నర ఏళ్లలో పూర్తి కాగా.. మిగతావాటి నిర్మాణ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. నిర్మాణం పూర్తయిన ఇళ్లను కేటాయించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు కసరత్తు చేసినా.. జిల్లాలో 280 మంది అర్హులైన పేదలకు మాత్రమే కేటాయించారు. దీంతో ఏళ్ల తరబడిగా నిరీక్షించిన అర్హులైన నిరుపేదల కలలు కల్లలయ్యాయి.

నిర్మాణాలు చేపట్టే వరకు బాలారిష్టాలే..

రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. హనుమకొండ జిల్లా పరిధిలోని వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాలకు చెందిన మండలాలకు 5,221 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటికే పరిపాలన అనుమతి వచ్చింది. నిర్మాణం పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్లు గతేడాది అక్టోబర్‌లో 1,196 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. పరకాల, ఆత్మకూరు, భీమదేవరపల్లి, ధర్మసాగర్ తదితర మండలాల్లో 280 ఇళ్లు కేటాయించగా.. హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్‌తోపాటు పలుచోట్ల నిర్మాణం పూర్తయినా మౌలిక వసతులు లేక పంపిణీ చేయలేదు.

దూపకుంటలో నిర్మాణం పూర్తయిన డబుల్ ఇళ్లు





సుబేదారిలోని డబుల్ బెడ్రూం లోపల ఇలా..

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే...

- వరంగల్ పశ్చిమ నియోజవర్గ పరిధిలో 1,505 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అంబేడ్కర్ నగర్‌లోని 6.33 ఎకరాల్లో 16 బ్లాకులుగా 592 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. పేదలకు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నా.. పంపిణీ చేయలేదు. లష్కర్ సింగారంలో 1.10 ఎకరాల్లో 208 ఇళ్లు, న్యూశాయంపేటలో 7.52 ఎకరాల్లో 19 బ్లాకులుగా మరో 608, కాజీపేటలో 1.20 ఎకరాల్లో 97 ఇళ్లు కట్టి అర్హులైన పేదలకు ఇవ్వాల్సి ఉండగా ఏళ్లు గడిచినా సాధ్యం కాలేదు.
- వరంగల్ మండలం ఎస్ఆర్‌నగర్‌లో 278 ఇళ్లకు 208 పూర్తికాగా.. వార్డుసభ ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ వాళ్లకు అధికారులు స్వాధీనపత్రాలు ఇప్పటికీ అందజేయలేదు. అయినప్పటికీ లబ్ధిదారులు ఆ డబుల్ బెడ్ రూమ్‌లను స్వాధీనం చేసుకొని ఏడాదిగా నివసిస్తున్నారు. 12వ డివిజన్ దేశాయిపేటలో 200 ఇళ్ల నిర్మాణం పూర్తయినా.. ఎవరికీ కేటాయించలేదు.
- ఖిలా వరంగల్ దూపకుంట రోడ్డులో 2వేల ఇళ్లకు 1,850 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. వీటిలో 150 పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగింది. తిమ్మాపురం శివారు లక్ష్మీపురంలో 1200 ఇళ్లకు గానూ 320 డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. ఖిలావరంగల్‌లో 85 పరిపాలన అనుమతులు మంజూరైనా డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం ఇంకా మొదలుకాలేదు.

ఏడేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం..



మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని చెప్పి గుడిసెలు తీయించారు. హనుమకొండ బాలసముద్రంలో ఇళ్లు కట్టి ఏళ్లు గడుస్తున్నా ఇవ్వడం లేదు. ఏడేళ్లుగా అసౌకర్యాల మధ్య భయం భయంగా గుడిసె వేసుకుని ఉంటున్నాం. విష కీటకాలతో సహవాసం చేస్తున్నాం.

- స్వప్న, బాలసముద్రం, హనుమకొండ

దోమలతో వేగలేకపోతున్నాం



మేం గతంలో ఉన్న చోట డబుల్ బెడ్ రూం ఇళ్లు కడుతుంటే సాయిబాబా గుడి ఎదుట స్థలంలో గుడిసెలు వేసుకుని ఉంటున్నాం. ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు లేవు. మురుగు నీరు పోయే దారిలేదు. దీంతో దోమలు పెరిగాయి. అనారోగ్యానికి గురవుతున్నాం. డబుల్ బెడ్ రూం ఇప్పుడు, అప్పుడు ఇస్తామంటున్నారు.. కానీ ఇవ్వడం లేదు.

- స్వరూప, జితేందర్ నగర్, హనుమకొండ

ఎన్నో ఆశలు పెట్టుకున్నాం..



డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇస్తారని ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నాం. ఇళ్లు పూర్తి కావడంతో కేటాయిస్తారని అనుకున్నాం. ప్రభుత్వం మారింది. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలి.

- టి.మంజుల, కాశిబుగ్గ

పథకం పేరు: రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం	ఎంపిక చేసిన స్థలాలు: 42	మంజూరైనవి (రెండు విడతలు): 5,221 (హనుమకొండ జిల్లాతోపాటు గ్రేటర్ పరిధిలో)	పరిపాలన అనుమతి లభించినవి (జూలై 2019 నాటికి): 4,784	పిలిచిన టెండర్ల సంఖ్య: 4,583	నిర్మాణాలు ప్రారంభం 3,098	పూర్తయినవి 1,196	వ్యయం రూ. 93.88 కోట్లు

కిష్టయ్య చేతిలోనే కీలక విభాగాలు

- బిల్లుల రూపకల్పన, ఆడిట్ చేసేది అతనే..
- ఏసీబీకి చిక్కడంతో కంగుతిన్న కేయూ అధికారులు
- కొందరు ఉద్యోగుల్లో గుబులు

కేయూ క్యాంపస్: కేయూలోని మూడు కీలక విభాగాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. క్యాంపస్‌లోని ఆడిట్ విభాగంలో ఆడిట్ ఆఫీసర్‌గా, హాస్టళ్ల డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా, కేయూ బిల్డింగ్ డివిజన్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కీలక బాధ్యతలను యూనివర్సిటీ అధికారులు అప్పగించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న ఆయనను కేయూ వీసీ రమేశ్ యూనివర్సిటీకి కొంతకాలం క్రితం బదిలీ చేయించుకున్నారు. కేయూ పబ్లికేషన్ సెల్ డైరెక్టర్, ఆడిట్ ఆఫీసర్ ప్రీ ఆడిట్, బిల్డింగ్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. కొంతకాలం పాటు పబ్లికేషన్ సెల్ డైరెక్టర్‌గా కూడా కిష్టయ్య విధులు నిర్వర్తించారు. పబ్లికేషన్ సెల్ నుంచే అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఏది కొన్నా.. ఆయనే బిల్లు రూపొందిస్తాడు.. ఆయనే ఆడిట్ ఆఫీసర్‌గా వాటిని మంజూరు చేస్తాడు. అప్పట్లో ఈవ్యవహారంలో పర్చేజింగ్ పరిశీలన ఆయనే చేస్తుండడంతో అవకతకలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు వచ్చాయి. రూ.3 వేల కూలర్‌కు రూ.8 వేల బిల్లులు చెల్లించినట్లుగా, రూ.8 వేల ప్లాస్టిక్ ట్యాంకుకు రూ.16 వేలు చెల్లించినట్లుగా అది కూడా పుస్తకాల కొనుగోలు బడ్జెట్ నుంచి నిధులు చెల్లించినట్లుగా ఆరోపణలున్నాయి. కొన్ని నెలల కింద పబ్లికేషన్ సెల్ బాధ్యతల నుంచి ఆయనను తప్పించారు. కానీ ముఖ్యమైన మరో మూడు విభాగాల్లో తానే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

కేయూ హాస్టళ్ల ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా..

కొన్నేళ్లుగా హాస్టళ్ల ఆఫీస్‌లో బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలున్నప్పటికీ వర్సిటీ అధికారులు పట్టించుకోలేదు. హాస్టళ్ల ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య బిల్లుల చెల్లింపుల్లో ఆమ్యామ్యాలకు పాల్పడుతున్నారనేది పాలవ్యాపారి వద్ద నుంచి రూ 50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడడంతో వెల్లడవుతోంది. హాస్టళ్ల ఆఫీస్‌లో పాలబిల్లులు, నిత్యావసరాలు, బియ్యం, కూరగాయలు చికెన్, మటన్, గుడ్లు అనేక వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి టెండర్‌దారులకు బిల్లులు చెల్లిస్తుంటారు. కిష్టయ్య తానే ఆడిట్ ఆఫీసర్ కావడంతో బిల్లులు పాస్ చేయడం చెల్లింపుల ప్రక్రియ కూడా ఆయన చేతిలోనే ఉండడం అవినీతి అవకతవకలకు పాల్పడుతున్నారనేది యూనివర్సిటీ ఉద్యోగుల్లో చర్చగా మారింది. హాస్టళ్ల ఆఫీస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని వివిధ విద్యార్థి సంఘాలు కూడా గతంలో డిమాండ్ చేశాయి. ఇదిలా ఉండగా.. అవినీతికి సహకరించే నలుగురు ఉద్యోగులను కూడా తాను పనిచేసే కార్యాలయాలకు బదిలీ చేయించుకున్నారు. హాస్టల్ ఆఫీస్‌కు ఒకరు. పబ్లికేషన్ సెల్‌కు ఒకరు. ఆడిట్ కార్యాలయానికి మరొకరు. బిల్డింగ్ డివిజన్‌కు ఇంకొకరిని బదిలీ చేయించుకున్నారు.



కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం

బిల్లుల తయారీ, ఆడిట్.. పాస్ అన్నీ ఆయనే..

కేయూ న్యాక్ పనుల కోసం కొంత కాలం క్రితం రూ.10 కోట్లకుపైగా నిధులు కేటాయించారు. వివిధ పనులు చేపట్టారు. అయితే ఆయా పనుల్ని కాంట్రాక్టర్లకు అప్పగించారు. వాటి పర్యవేక్షణ, బిల్లుల తయారీ అంతా కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారి కార్యాలయం పరిధిలో ఉంటుంది. కీలకమైన బిల్డింగ్ డివిజన్ కార్యాలయంలో కూడా అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలను కిష్టయ్యకే వర్సిటీ అధికారులు అప్పగించారు. బిల్లుల రూపకల్పన, ఆడిటింగ్, మంజూరు వంటివి ఆయన చేతిలో ఉండడంతో అవకతకలకు ఆస్కారం ఏర్పడిందనేది వర్సిటీ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. కొందరికి అతడే దగ్గరుండి బిల్లుల చెల్లింపుల్లోనూ కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి.

వీసీకి సన్నిహితుడిగా ఉండడంతోనే..

కిష్టయ్య వీసీ రమేశ్‌కు అత్యంత సన్నిహితుడైన ఉద్యోగిగా కిష్టయ్య కొనసాగుతున్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో వైస్ ప్రిన్సిపాల్ గతంలో రమేశ్ బాధ్యతలను నిర్వర్తించారు. ఆసమయంలోనూ ఏఆర్‌గా కిష్టయ్య విధులు నిర్వర్తించారు. అప్పట్నుంచి వీరి మధ్య అనుబంధం ఉంది. దీంతోనే వీసీ రమేశ్ తనకు నమ్మకస్తుడిగా ఉంటాడని అక్కడి నుంచి క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలోని కీలక పదవులు అప్పగించారనేది ఉద్యోగుల్లో చర్చ. ఎందుకంటే బిల్లులు రూపొందించేవారు ఒకరుంటే మరొకరు ఆడిట్ ఆఫీసర్‌గా ఉండాలి. కానీ ఒకరికే ఆయా బాధ్యతలను వర్సిటీ అధికారులు అప్పగించడంలో ఆంతర్యమేంటనే ప్రశ్నతలెత్తుతోంది.

కంగుతున్న ఉద్యోగులు..

కిష్టయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో వీసీ, రిజిస్ట్రార్‌తోపాటు కొందరు పరిపాలనాధికారులు కంగుతిన్నారు. ప్రధానంగా సీడీసీ, డీన్ అకాడమిక్ ఆడిట్, బిల్డింగ్ డివిజన్, యూజీసీ, పరీక్షల విభాగంలోని అధికారుల్లో ఆందోళన మొదలైంది. అంతేకాకుండా పలు కళాశాలల అఫ్లియేషన్ ఇచ్చే సమయంలోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలూ ఉన్నాయి. డీన్ అకాడమిక్ కార్యాలయంలో కొన్నేళ్ల నుంచి కళాశాలల నుంచి రావాల్సిన బకాయిలను వసూలు చేయడంలోనూ తాత్సారం చేస్తున్నారని, కొన్ని కళాశాలలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఇందులో మరో ఉద్యోగి అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

కేయూలో ఏసీబీ కలకలం

- పాలవ్యాపారి వద్ద రూ.50 వేల లంచం డిమాండ్ - 8లో
- అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య బాగోతం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అరెస్ట్.. హైదరాబాద్‌కు తరలింపు



ఏసీబీకి చిక్కిన కిష్టయ్య

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- తొమ్మిదిన్నరేళ్లలో ఒక్క అధికారి మీ దగ్గరకు వచ్చిండా?
- కాంగ్రెస్ పాలనలో ఇంటి దగ్గరికొచ్చి తెలుసుకుంటున్నారు
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



కాశిబుగ్గ ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

కాశిబుగ్గ/వరంగల్/ఖిలా వరంగల్: తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క అధికారి అయినా మీ ఇంటి ముందుకు వచ్చి సమస్యలు తెలుసుకున్నారా? అదే కాంగ్రెస్ పాలనలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా మీ ఇంటి దగ్గరికి వచ్చి పథకాలకు దరఖాస్తులు తీసుకుంటున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం 19వ డివిజన్ కాశిబుగ్గ వీకర్‌సెక్షన్ కాలనీ, దేశాయిపేట, వరంగల్ 34 డివిజన్ భూపేష్‌నగర్ కమ్యూనిటీహాల్, ఉర్సు కరీమాబాద్‌లోని సీఆర్‌సీ భవనంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాల్లో మంత్రి కొండా సురేఖ పాల్గొని దరఖాస్తులు తీసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో తెలిపిన విధంగా 100 రోజుల్లో ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే రెండు స్కీంలు మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. రాబోయే 70 రోజుల్లో పూర్తి వివరాలు సేకరించి ఆరు గ్యారంటీల అమలు చేపట్టి ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు వారి పాలనలో చేయడం చేతకాక ఇప్పుడు 420 మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. అంతకుముందు ఆమె దేశాయిపేటలోని బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, నల్గొండ రమేష్, గోపాల నవీన్‌రాజు, దాసరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజాపాలన'కు చివరి గడువు

వరంగల్ అర్బన్: అభయహస్తం ఆరు గ్యారంటీల అమలు పథకాల దరఖాస్తుల స్వీకరణకు శనివారం ఒక్క రోజే మిగిలి ఉంది. శుక్రవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పలు డివిజన్లలో ప్రజాపాలన కార్యక్రమాలను రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా క్షేత్రస్థాయిలో సందర్శించి పలు సూచనలు చేశారు. మహానగర వ్యాప్తంగా 66 డివిజన్లలో శుక్రవారం 32,778 దరఖాస్తులు నమోదయ్యాయి. వాటిలో జనరల్ దరఖాస్తులు 6,570, రేషన్ కార్డుల కోసం 6,994, ఆరు గ్యారంటీల కోసం 19,724 నమోదయాయ్యాయి. కాగా.. గత ఏడు రోజుల్లో మొత్తం 2,49,992 దరఖాస్తులు రాగా.. వాటిలో సాధారణ దరఖాస్తులు 32,000, రేషన్ కార్డుల కోసం 29,262, వివిధ పథకాల కోసం 1,88,730 అందినట్లు బల్దియా అధికారులు వెల్లడించారు.

నిబద్ధతతో సమాచారాన్ని నమోదు చేయండి

అభయహస్తం ఆరు గ్యారంటీలకు అందిన ప్రతీ దరఖాస్తును తప్పుల్లేకుండా నిబద్ధతతో ఆన్‌లైన్ చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హనుమకొండ చైతన్య డిగ్రీ కళాశాలలో ప్రజాపాలన దరఖాస్తుల నమోదు కోసం డాటా ఎంట్రీ ఆపరేటర్ల నిర్వహించిన శిక్షణలో కమిషనర్ హాజరై మాట్లాడారు. దరఖాస్తులను ప్రామాణికంగా తీసుకుని నమోదుకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు గోడిశాల రవీందర్, కృష్ణారెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దైవ దర్శనానికి వెళ్తూ వ్యక్తి మృతి

- భద్రాచలం వెళ్తుండగా ప్రమాదం
- అయ్యప్పమాలలో కుమారులు


అంజయ్య మృతదేహం

గార్ల: భద్రాద్రి రాముడిని దర్శించుకునేందుకు కాలినడకన వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన శుక్రవారం మానుకోట జిల్లా గార్ల మండలంలోని కొత్తపోచారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలపిన వివరాల ప్రకారం.. కొత్తపోచారం గ్రామానికి చెందిన మలీదు అంజయ్య (56) కాలినడకన భద్రాచలం బయల్దేరాడు. అంజయ్య ఇద్దరు కుమారులు కోటేష్, వెంకటేష్ అయ్యప్పమాల ధరించి గత 6రోజుల క్రితం శబరిమలై వెళ్లారు. కుమారులు ఇద్దరు శబరిమలై వెళ్లి వచ్చేలోగా భద్రాచలం వెళ్లి మొక్కులు తీర్చుకొని వస్తానని ఇంట్లో భార్యకు చెప్పిన అంజయ్య.. ఈనెల 3వ తేదీన ఇంటి నుంచి కాలినడకన బయల్దేరాడు. 4వ తేదీ రాత్రి పాల్వంచ సమీపంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో బస చేశాడు. ఆ సమయంలో భార్యతో ఫోన్లో మాట్లాడి పెద్దమ్మతల్లి దేవాలయంలో పడుకున్నానని చెప్పాడు. తెల్లవారు జామున కాలినడక తన ప్రయాణం ప్రారంభించాడు. ఈక్రమంలో జగన్నాథపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అంజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం 6గంటలకు భార్య ఫోన్ చేయగా అంజయ్య ఫోన్ లిఫ్ట్ చేయలేదు. గంట తర్వాత మళ్లీ ఫోన్ చేయడంతో ఓ వ్యక్తి ఫోన్ తీసి అంజయ్య రోడ్డుపై చనిపోయి ఉన్నాడని చెప్పాడు. ఈక్రమంలో పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి చనిపోయిన విషయం తెలుసుకున్న కుమారులు శబరిమలై నుంచి బయలుదేరినట్లు గ్రామస్తులు తెలిపారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి


బొగత వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ శాంతారామ్

వాజేడు: బొగత జలపాతం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శాంతారామ్ సిబ్బందికి సూచించారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతాన్ని శుక్రవారం ఆయన ఎఫ్‌డీఓ అగర్వాల్‌తో కలిసి సందర్శించారు. జలపాతం వద్ద ఉన్న సమస్య, చేపట్టాల్సిన అభివృద్ధి వివరాలను తెలుసుకున్నారు. బొగతకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా చర్యలను తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట రేంజర్ చంద్రమౌళి, సిబ్బంది ఉన్నారు.

కేయూలో ఏసీబీ కలకలం

పాలవ్యాపారి వద్ద రూ.50వేల లంచం డిమాండ్

- అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య బాగోతం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు


కిష్టయ్య (వృత్తంలోని వ్యక్తి) ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు


పట్టుబడిన డబ్బు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ అధికారుల దాడులు శుక్రవారం కలకలం రేపాయి. యూనివర్సిటీ చరిత్రలో క్యాంపస్‌లోకి తొలిసారిగా ఏసీబీ అధికారులు అడుగుపెట్టారు. యూనివర్సిటీలోని కొందరు అవినీతి అధికారులపై పలు ఫిర్యాదులున్నా.. ఏసీబీ దాకా వెళ్లలేదు. తాజాగా ఓ పాలవ్యాపారి తన బిల్లు కోసం లంచం డిమాండ్ చేసిన అధికారిపై ఫిర్యాదు చేయడం.. ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం సంచలనం సృష్టించింది. యూనివర్సిటీలోని ఆడిట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య శుక్రవారం పాలవ్యాపారి వద్ద రూ.50వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం సంచలనం కలిగించింది. కిష్టయ్య లంచం తీసుకుంటుండగా హనుమకొండ ఏసీబీ అధికారి సాంబయ్య పలువురు ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన పాలవ్యాపారి పెండెం రాజేందర్ సుమారు నాలుగు సంవత్సరాలుగా కాకతీయ యూనివర్సిటీలోని నాలుగు హాస్టళ్లకు సంబంధించిన మెస్‌లకు పాలు సరఫరా చేస్తున్నాడు. కొన్నినెలల పాల బిల్లు రూ.19లక్షలు హాస్టల్ ఆఫీస్ నుంచి చెల్లించాల్సి ఉంది. ఈక్రమంలో హాస్టల్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా.. ఆడిట్ ఆఫీస్ లోనూ కిష్టయ్య బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దీంతో బిల్లు పాస్ చేసేందుకు పాలవ్యాపారి రాజేందర్ నుంచి రూ.75వేల లంచం డిమాండ్ చేశాడు. తాను లంచం ఇచ్చుకోలేనని బిల్లు పాస్ చేయాలనికోరగా మా సారుకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని.. ఇస్తేనే బిల్లు పాస్ చేస్తానని చెప్పడంతో చివరికి రూ.50వేలు ఇచ్చేందుకు రాజేందర్ అంగీకరించాడు. దీంతో 2023 డిసెంబర్ 31న బిల్లుకు సంబంధించిన రూ.14లక్షలు రాజేందర్ అకౌంట్‌కు పంపించారు. అనంతరం తనకు ఇస్తానన్న రూ.50వేలు ఇవ్వాలని కిష్టయ్య అడగడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని రాజేందర్.. ఏసీబీ అధికారులు ఆశ్రయించాడు. ఈక్రమంలో శుక్రవారం కేయూ ఆడిట్ ఆఫీస్‌లో విధి నిర్వహణలో ఉన్న కిష్టయ్య.. పాలవ్యాపారి రాజేందర్ నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారి సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. పాలవ్యాపారి పెండెం రాజేందర్‌కు బిల్లు చెల్లించేందుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య రూ.50వేలు డిమాండ్ చేసి, వేధించారని బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు కిష్టయ్య డబ్బులు తీసుకుంటుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. పంచనామా జరిపి కిష్టయ్యను అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. కాకతీయ యూనివర్సిటీలోని హాస్టళ్ల ఆఫీస్‌లో కూడా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఒకరు రికార్డులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వెంకయ్య సమక్షంలో విచారణ చేపట్టడంతోపాటు, రికార్డులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

కేయూ చరిత్రలో మొదటిసారి

యూనివర్సిటీ చరిత్రలో ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఉద్యోగి) ఏసీబీకి పట్టుబడటం తొలిసారి కావటం సంచలనం కలిగించింది. ఈఘటనతో అవకతవకలకు పాల్పడేవారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కిష్టయ్య ఏసీబీకి పట్టుబడ్డారని తెలుసుకున్న ఉద్యోగులు పరిపాలనాభవనం వైపు పరిశీలించి ఏం జరిగిందనేది తెలుసుకుని వెళ్తున్నారు. కొందరైతే యూనివర్సిటీ బయటికి వెళ్లిపోయారు. కిష్టయ్యకు అనుచరవర్గంగా ఉన్నవారు కిష్టయ్య గతంలో పనిచేసిన కళాశాల నుంచి వచ్చి వివరాలపై ఆరా తీయడం గమనార్హం.

డబ్బులు ఇస్తేనే బిల్లు పాస్ చేస్తానన్నాడు



కేయూలోని నాలుగు హాస్టళ్ల(మెస్)కు కొంత కాలంగా పాలు సరఫరా చేస్తున్నాను. రూ.19లక్షల బిల్లు చెల్లించేందుకు కిష్టయ్య రూ.75వేలు లంచం అడిగాడు. ముందుగా బిల్లుచెల్లిస్తే రూ.50వేలు ఇస్తానన్నాను. దీంతో 2023 డిసెంబర్ 31న రూ.14లక్షలు చెల్లించాడు. నాటినుంచి తనకు ఇస్తానన్న రూ.50వేల కోసం ఫోన్ చేస్తున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీని ఆశ్రయించా. కేయూ ఆడిట్ ఆఫీస్‌లో విధి నిర్వహణలోనే నా వద్ద రూ.50వేలు లంచం తీసుకున్నాడు. దీంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

– పెండెం రాజేందర్, పాలవ్యాపారి

ఏఆర్ కిష్టయ్య అరెస్ట్

యూనివర్సిటీలో మిల్క్ డిస్ట్రిబ్యూటర్ పెండెం రాజేందర్‌కు పాల బిల్లు చెల్లించేందుకు రూ.50వేలు లంచం తీసుకున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం 11–48గంటలకు కేయూలోని ఆడిట్ బ్రాంచిలో ఏఆర్ కిష్టయ్య.. రాజేందర్ నుంచి రూ.50వేలు తీసుకోగా పట్టుకున్నామని తెలిపారు. కిష్టయ్య నుంచి రూ.50వేలు రికవరీ చేసి, అరెస్టు చేశామని వెల్లడించారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలి

- అకుట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కీలక సెక్షన్లలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు నిదర్శనమని ఇటువంటి వారి వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకునేలా విచారణ జరపాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అకుట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. కేయూలో నాలుగు ముఖ్యమైన విభాగాలకు ఒక్కరినే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. టీచర్ల అరియర్స్, ఎచ్.ఆర్.ఏ, డీ.ఏ, పదోన్నతి ఎరియర్స్ కూడా ఇవ్వకుండా అవినీతి అక్రమాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. అధ్యాపకుల వేతనాల్లో భాగమైన జీపీఎఫ్ కూడా ఇవ్వకపోవడంపై టీచర్లు వీసీ, రిజిస్ట్రార్‌ల పాలనపై అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అసమర్థ వీసీ, రిజిస్ట్రార్‌ల వల్ల వర్సిటీలో సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. యూనివర్సిటీలో అక్రమ నియామకాలు చేపడుతూ టీచర్లపై కక్ష పూరిత చర్యలకు పూనుకుంటున్నారని అకుట్ ఎప్పటినుంచో ఫిర్యాదు చేస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటువంటి అవినీతి అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అకుట్ కోరినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టీచింగ్, నాన్–టీచింగ్‌ల బదిలీలు, డిపార్ట్‌మెంటల్ కమిటీలు, సెలెక్షన్ కమిటీలు లేకుండానే నియామకాలు చేపడుతూ కేయూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథా చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

తల్లిని చంపిన మతిస్థిమితం లేని కొడుకు

- రోకలిబండతో తలపై మోదీ ఘాతుకం
- అడ్డువచ్చిన మరో మహిళపై దాడి.. నిందితుడి పరారీ
- చిన్నకోడెపాకలో అనుమానాస్పదంగా సంచరించగా చెట్టుకు కట్టేసిన గ్రామస్తులు


రాజిరెడ్డిని కట్టేసిన గ్రామస్తులు


హైమావతి(ఫైల్)

రేగొండ: మానసికస్థితి సరిగా లేని కుమారుడు.. కన్న తల్లిని రోకలిబండతో మోది చంపాడు. అడ్డువచ్చిన మరో మహిళపై దాడి చేయడంతో ఆమె ప్రాణపాయస్థితిలో ఉంది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల హైమావతి(60) కుమారుడు రాజిరెడ్డి కొన్నాళ్లుగా మానసికస్థితి సరిగా లేకపోవడంతో వింతగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతని ప్రవర్తన తట్టుకోలేక తల్లి హైమావతి, భార్య సరిత పక్కింట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా పక్కింట్లో నిద్రించిన తల్లి, భార్యను ఇంటికి రావాలని ఒత్తిడి చేశాడు. దీంతో వారు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాజిరెడ్డి.. తల్లి హైమావతి తలపై రోకలబండతో మోదడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన చూసిన రాజిరెడ్డి భార్య సరిత భయంతో కేకలు వేయడంతో సమీప బంధువైన ఊకంటి తిరుపతమ్మ అక్కడికి వచ్చింది. ఆమెపై సైతం రాజిరెడ్డి దాడి చేశాడు. ఎవరైనా ఇక్కడికి వస్తే చంపేస్తానంటూ భయానక వాతావరణాన్ని సృష్టించి పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ తిరుపతమ్మను గ్రామస్తులు చికిత్స నిమిత్తం 108లో హైదరాబాద్‌కు తరలించారు. డీఎస్పీ రాములు, సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పారిపోయిన రాజిరెడ్డి శుక్రవారం ఉదయం కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాకలో అనుమానాస్పదంగా సంచరించడంతో దొంగగా భావించిన గ్రామస్తులు చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చిట్యాల సీఐ దాసారపు వేణుచందర్ ఆధ్వర్యంలో రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పలు గ్రామాల ప్రజల సహాయంతో నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చేరుకుని చూడగా తల్లిని హత్య చేసి పారిపోయిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి సోదరుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మేడారంలో విస్తృత సేవలు

- బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం చంద్రమౌళి

ఏటూరునాగారం: మేడారం జాతర సమయంలో వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతం చేస్తామని బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం, ఏటూరునాగారంలోని బీఎస్ఎన్ఎల్ టవర్లు, కేబుల్ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించిన అంతరం మాట్లాడారు. భక్తులకు మరిన్ని సేవలు అందించడానికి శాశ్వత టవర్లతోపాటుగా నూతనంగా మరో 9 టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 4జీ సేవల కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలను లోకల్ కేబుల్ ఆపరేటర్ల ద్వారా ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వినియోగదారులకు సంస్థ ఆఫర్లను కూడా అందిస్తోందని వివరించారు. తమ ఇంటర్నెట్‌ను తీసుకొని 50శాతం భాగస్వామ్యంతో కనెక్షన్‌లు ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కస్టమర్లకు మరింత సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం సెల్ టవర్లను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఏటూరునాగారంలో ఉన్న టవర్ వద్ద పటిష్టమైన ప్రహరీ, భద్రత ఉండాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏజీఎం సురేష్, డీఈ వసంత్‌కుమార్, ఎస్‌డీఈ నర్సింహమూర్తి, జేటీఓ రాధాకృష్ణతోపాటు కేబుల్ టీవీ ఆపరేటర్లు చెన్న భిక్షపతి, అలువాల శ్రీనివాస్, ఏవీఎం నెట్ యజమాని అల్లి వేణుమాధవ్, బోడ వెంకటస్వామి, చెన్న రమేష్, చారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి: గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోక వెనుకబడిన గ్రామాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులంతా ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. ఎన్నికల అనంతరం గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రబీలో సాగు చేసే పంట పొలాలకు సాగు నీరందించేందుకు సంబంధిత ఉన్నత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలిపారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేయనున్నట్లు వెల్లడించారు. గత పది సంవత్సరాలుగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, తాగునీటి సమస్య, బస్సు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. నిత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్‌రావు, నాయకులు సుకినె సంతాజీ, దాట్ల రాముడు, చల్లా రవీందర్‌రెడ్డి, హింగె శ్రీకాంత్, శనిగరం వెంకటేష్, బొల్లెపోగు రమేష్‌బాబు, స్వరూప, పుష్ప, ముప్పు మహేందర్, సుమన్‌గౌడ్, సురేందర్, బాబురావు, అనీల్‌కుమార్, రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురి ఆత్మహత్య

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే.. ముగ్గురు ఆర్థిక ఇబ్బందులతోనే తనువు చాలించారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. బంధువులు కుంటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలు కిందపడి యువకుడు..


రాజు మృతదేహం

గార్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మానుకోట జిల్లా గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని డబ్బాలమోరీ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన కళ్లెం రాజు(26) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ గ్యాస్‌స్టవ్‌లు మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్యాస్‌స్టౌల మరమ్మతులతో వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ పంకజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

సంతాలాల్‌పోడు తండాలో..

బయ్యారం: అప్పులు చేసి మద్యానికి అలవాటు పడిన ఓ యువకుడు అప్పులు భారంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని సంతాలాల్‌పోడుతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ అంజి(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవటంతో వారం క్రితం పురుగుల మందు తాగగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈక్రమంలో పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీనగర్ కాలనీలో..

కాజీపేట: హనుమకొండ జిల్లా కాజీపేట 48వ డివిజన్ దర్గా కాజీపేట శివారులోని గాంధీనగర్ కాలనీకి చెందిన ఎస్‌కె యాకుబ్ (41) కుటుంబ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఆందోళనకు గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. కార్ వాష్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్న యాకుబ్ సొంత ఇంటి నిర్మాణానికి ఫైనాన్స్ తీసుకున్నాడు. ఈక్రమంలో వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో సకాలంలో కిస్తీలు చెల్లించలేక సతమతమయ్యాడు. కుటుంబ సభ్యుల సహకారంతో ఫైనాన్స్ అప్పులు చెల్లించినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనోవేదనకుగురై ఆత్మహత్య చేసుకున్న భార్య షేక్ థైసిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.


డాక్టర్‌పై చర్య తీసుకోవాలి

- తల్లి గర్భంలో శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- జిల్లా ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, డీఎస్‌పీ నాయకుల ధర్నా


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, డీఎస్‌పీ నాయకులు

నర్సంపేట రూరల్: తొమ్మిదినెలలు నిండిన గర్భవతికి ఉమ్మనీరు పోతుందని ఆస్పత్రికి తీసుకురాగా సమయానికి వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది చూడడంతో గర్భంలోనే శిశువు మృతిచెందిందని, వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని సంగాల శివకృష్ణ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఎదుట కృష్ణ కుటుంబ సభ్యులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌తో మాట్లాడి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్‌కు చెందిన సంగాల శివకృష్ణ భార్య సంగాల మమలత గర్భవతి. 2023డిసెంబర్ 30న సాయంత్రం 6గంటలకు రక్తస్రావం, ఉమ్మనీరు పోతుండగా నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆసమయంలో డ్యూటీలో ఉండాల్సిన గైనకాజిస్టు సునీతారెడ్డి అందుబాటులో లేకపోవడంతో తగిన సమయంలో వైద్యం అందించలేకపోయారు. దీంతో 31వ తేదీన తెల్లవారు జామున 3గంటలకు తల్లిగర్భంలోనే శిశువు మృతిచెందింది. డాక్టర్ నిర్లక్ష్యం మూలంగానే మా శిశువు చనిచెందిందని, తక్షణమే ఆ వైద్యురాలని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజ్‌కుమార్ అక్కడకు చేరుకొని బాధితులతో.. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. సమస్య ఉంటే ఆందోళన విరమించి సూపరింటెండెంట్‌తో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్‌తో మాట్లాడి వినతిపత్రాన్ని అందించారు. ఈ విషయంపై డాక్టర్ గోపాల్‌ను వివరణ కోరగా సంగాల మమలత ఆస్పత్రికి వచ్చిన సమయంలో డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలోనే ఉన్నారని, ఆరాత్రి మూడు సార్లు పేషెంట్‌ను డ్యూటీ డాక్టర్ పరిశీలించారని తెలిపారు. పేషెంట్‌కు ఉమ్మనీరు పోతున్నది వాస్తవమేనని, రక్త స్రావం కాలేదని, దీంతో నార్మల్ డెలవరీ కోసం వైద్యురాలు ప్రయత్నించారని పేర్కొన్నారు. రక్తస్రావం అయితే వెంటనే ఆపరేషన్ చేసేవారని, ఈలోగానే తల్లి గర్భంలో శిశువు గుండె ఆగిపోయిందని వివరించారు. ఈ ఘటన వైద్యురాలి నిర్లక్ష్యం ఏమిలేదన్నారు. అయినప్పటికీ ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని, వైద్యురాలి నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కామర్స్‌లో ప్రతి విద్యార్థికి మూడు మార్కులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల జరిగిన బీకాం ఐదో సెమిస్టర్ మూడో పేపర్‌లో ఈ కామర్స్ సబ్జెక్టు ప్రశ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేవిధంగా ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం పరీక్షల విభాగం దృష్టికి చేరడంతో సంబంధిత పాఠ్యప్రణాళిక అధ్యక్షుడు, అదనపు పరీక్షల నియంత్రణాధికారి వాస్తవమేనని నిర్ధారించారు. దీంతో ప్రతి విద్యార్థికి మూడు మార్కులు అవార్డు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ప్రశ్నాపత్రంలో తప్పిదానికి సంబంధించి నిబంధనల ప్రకారం సంబంధిత ఉద్యోగులపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు?

ఆత్మకూరు: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ శివారులో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు మండలంలో శుక్రవారం జోరుగా ప్రచారం జరిగింది. స్థానికంగా ఉండే కొందరితోపాటు వరంగల్‌కు చెందిన పలువురు ముఠాగా ఏర్పడి మట్టి తవ్వకాల పేరుతో గుప్త నిధుల వేట కొనసాగిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముఠాలో మరో నలుగురు పరారైనట్లు తెలిసింది. ఇదే విషయంపై పోలీసులను వివరణ కోరగా.. ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.